

# అడుగున వెంకట్రావు పేరుంది!

• బొల్లాప్రగడ కృష్ణమూర్తి •

పదిహేను రోజులనుంచి కష్టపడుతున్నా ఆ కథకోసం. యిప్పటివరకూ వ్రాస్తున్న రచయితలందరికంటేను, యికముందు వ్రాయబోయే వారికంటేను. తమాషాగా బాగా వ్రాసి, మెప్పు పడయాలనుకున్నా. వ్రాసినదాన్ని నాకు తెలిసిన గొప్పగొప్పవారికి చదివి వినిపించా.

అంతా బాగుందన్నారు. దేనికైనా పత్రికకు పంపి, నా ప్రతాపాన్ని ప్రపంచానికి వెల్లడి చెయ్యాలని ఉద్దేశం. పది పేజీల గ్రంధాన్నీ ఫెయిర్ కాపీ తీసా. అక్కడక్కడ కొట్టివేత లున్నాయని, ఒకమారు, సిరామరకలు పడ్డాయని మరొకమారు దస్తూరీ కుదరలేదని యింకొకమారు యిలా వంకలతో వ్రాసినదాన్నే నాలు గయిదుమార్లు రద్దుచేసా.

కథ పూర్తి అయిన రెండు నెలలకుకాని కవరులో పెట్టి అంటించే అవకాశం కుదిరిందికాదు. దీన్నిగురించి ఆఫీసులో వర్కు అంతా ఎరియర్స్‌లో పడిపోయింది. యింటిదగ్గర చేసుకోవడానికి వీలుగావున్న కాగితాలు తెచ్చుకుంటే, మా వెంకట్రావు, వాడికి ఎస్.ఎస్.ఎల్.సి. పబ్లిక్కు ఏదైనా చెప్పమని పీక్కుతినేవాడు.

భగవంతుడి దయవల్ల ఆఫీసువర్కు, వెంకట్రావు పోరూ, లేకపోతే చిన్నతనంనుంచీ, తన అడుపాజ్ఞలలో నుంచి. విద్యాబుద్ధులు నేర్పి నన్నింతవాడిని చేసిన, మా గురువుగారు వచ్చి, శివాలయంలో పురాణానికి రమ్మనేవారు. ఎలా కాదనగలను?

ఎలాగోలాగ ఒక నెలరోజులు గడచిపోయాయి. ఎంతో ప్రళయంమీద ఫెయిర్‌కాపీ తయారయింది. కమలానికి, అంటే నా ప్రియపత్నికి, దీన్ని చదివి వినిపించి ఆవిడగారి ఒపినియన్ కూడా తెలుసుకుందామని కోరిక. వెంటనే పిలిచా.

"కాఫీ కలుపుతున్నా. వస్తున్నా" అని జవాబు.

టపాకు టయిమయిపోతూంది అన్న ఆరాటం నాలో ఎక్కువవుతూంది. పిలచిన అరగంట సేపటికి గాజుగ్లాసులో కాఫీ పోసుకుని, గాజుల గలగలలతో, గంధర్వాంగనలా, నా గదిలో ప్రత్యక్షమయింది మా కమలం. కాఫీ కానిచ్చాకా కథ చదువుదామన్న వుద్దేశంతో కళ్ళు కమలం కేసివుంటే, చేతులు కాఫీగ్లాసును అందుకున్నాయి. యింతకూ నా కథ ఏ ముహూర్తాన్న మొదలు పెట్టానోకాని, కాఫీగ్లాసు టప్‌మని బద్దలయిపోయి, కాఫీ అంతా కథమీద ఒలికిపోయింది. ఆ సమయంలో కమలాన్ని ఏం చెయ్యాలో నాకే పాలుపోయిందికాదు.

"వేడి కాఫీ గాజుగ్లాసులో పోస్తే, బద్దలవుతుందని తెలిసి ఏడవలేదూ!" అని వురిమా.

"రోజూమాత్రం పొయ్యడంలేదూ!" అంది.

"యింకా తిరిగి సమాధానంకూడానూ!" అని మళ్ళీ కేకలేసా. కమలం కళ్ళనిండా నీళ్లు తెచ్చుకుని, లోనికి వెళ్ళిపోయింది గాజుపెంకులు ఏరుకుని.

"అయిందేదో అయిపోయింది" అని కాలం పాడుచెయ్యకుండా కథ మళ్లా పూర్తిచేసా. నెలాఖరు. కాఫీకి కానీ అయినా లేకపోయినా, కవరు కొని, కథ పోస్టుచేసా, మళ్లా వారం ఆనంద వాణిలో పడుతుందనే వుద్దేశంతో. ఆ మర్నాడే ఆదివారం, ఆనందవాణి వచ్చింది. అందులో నా కథ వుంది. "యిదేమిటి! నిన్న పంపితే యీ సంచికలోనే ఎలా పడింది!!" అని తిరగేసి చూసా.

అడుగునమాత్రం మా వెంకిగాడి పేరుంది. నిర్ఘాంతపోయా. యింతకూ వాడి నసవలసిన పని యేముంది. 'ఆలస్యం అమృతం విష'మన్నారు.